

భారత్‌కు మహా'యోగ'ం!

భారత్‌లో పుట్టిన యోగాకు ప్రపంచ వ్యాప్తం గా ఎంతో గుర్తింపు లభించిందని పలువురు వక్తలు కొనియాడారు. - 8లో



ఉద్యోగంలో చేరిన మొదటి రోజే

పరిశ్రమలో ఉద్యోగంలో చేరిన మొదటి రోజే ఓ యువకుడు బస్సు కింద పడి మృత్యువొడికి చేరాడు. - 8లో



కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

ఏర్పేడు ఐఐటీలో కేంద్రీయ విద్యాలయాన్ని శుక్రవారం డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ ప్రారంభించారు. - 8లో

సాక్షి తిరుపతి

శనివారం ౹ 22 ౹ జూన్ ౹ 2024

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ధ్యాన్‌చంద్ర బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ధ్యాన్‌చంద్ర

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర భూగర్భ గనులశాఖ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర ఇన్‌చార్జి కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మరోవైపు కలెక్టరేట్ ఉద్యోగులతోపాటు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు గజ మాలతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సత్కరించారు. ఆ మేరకు ఆయన శుక్రవారం రిలీవ్ అయ్యారు.

ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్‌గా డాక్టర్ సుమతి



తిరుపతి సిటీ : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) సహా పరిశోధనా సంచాలకులుగా డాక్టర్ వీ.సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర దక్షిణ మండలం పరిధిలోని చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని పరిశోధన స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. గతంలో ఏడీఆర్‌గా పనిచేసిన డాక్టర్ సి రమణ ప్రధానశాస్త్రవేత్తగా బదిలీపై వెళ్లారు.

24 మంది డీబార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో శుక్రవారం జరిగిన డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 24 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో చిత్తూరు జోన్‌కు సంబంధించి 13 మంది, తిరుపతి జోన్‌లో ఐదుగురు, మదనపల్లి జోన్‌లో ఆరుగురు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతుండగా హైపవర్ ఇన్‌స్పెక్షన్ కమిటీ డీబార్ చేసినట్లు ఆయన వివరించారు.


వ్యాధుల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యాన్‌చంద్ర

తిరుపతి అర్బన్: వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో వాటి నివారణకు సంబంధించి అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ హెచ్ఎం ధ్యాన్‌చంద్ర సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నెల రోజులపాటు డయేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. అన్ని శాఖలు సమష్టిగా ఇంటింటా డయేరియా నివారణకు తీసుకోవాల్సి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. డీఎంహెచ్ఓ శ్రీహరి, డిప్యూటీ సీఈఓ ఆది శేషారెడ్డి, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శాంతకుమారి, డివిజనల్ పంచాయతీ అధికారిణి రూపారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ బాలాజీ పాల్గొన్నారు.

జాతరోత్సాహం!




ప్రత్యేక వాహనంపై కొలువైన పోలేరమ్మ తల్లి

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని బంగారుపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలేరమ్మ జాతర శుక్రవారం తెల్లవారుజామున ఘనంగా ముగిసింది. గురువారం రాత్రి ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బంగారుపేట పొలిమేర్ల చుట్టూ బలి కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పూల వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం చేపట్టారు. ఇందులో కేరళ వాయిద్యాలు, కాంతార నృత్యాలు, డీజే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా కట్టుకున్నాయి. అనంతరం ఆర్వీఎం ఉన్నత పాఠశాల సమీపంలో ఆసాదులు తప్పెట్లు.. తాళాల మధ్య అమ్మవారి విరూపోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

మనుషులా... తోడేళ్లా?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీడీపీ కార్యకర్తలు కొందరు పగతో రగిలిపోతున్నారు. మనిషి జన్మనెత్తి క్రూరజంతువుల్లా ప్రవర్తిస్తున్నారు. నిద్దురలేస్తే నెత్తురు కళ్లజూడడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులకు తెగబడుతున్నారు. వారి కుటుంబాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వేటకొడవళ్లు, మారణాయుధాలతో రావణకాష్టం సృష్టిస్తున్నారు. ఇళ్లు, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. అడ్డొచ్చిన వారిని చితకబాదుతున్నారు. వీరి ఆగడాలకు కళ్లెం వేయాల్సిన ఆ పార్టీ ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పోలీసులు సైతం చూసీచూడనట్టు వదిలేయడం సర్వత్రా విస్మయానికి గురిచేస్తోంది.





గంగనపల్లెలోని వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడి ఇంటి వద్ద వేట కత్తులతో ప్రత్యర్థులు

విస్తరిస్తున్న విషసంస్కృతి

- ఎన్నికల తర్వాత గొడవలు.. దాడులు ఎప్పుడూ లేదు
- చిత్తూరులో చాపకిందనీరులా పాకుతున్న గూండాగిరి
- శాంతిభద్రతల రక్షణలో పోలీసుల వైఫల్యం
- కేసులతో యువత భవితకు దెబ్బ
- నేతలు కల్పించుకుంటేనే శాంతియుత వాతావరణం



టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన చుడా మాజీ చైర్మన్ కారు

చిత్తూరు అర్బన్: చిత్తూరు రాయలసీమలో ఉన్నా, ఫ్యాక్షన్ గొడవలు, పగ, ప్రతీకార దాడులకు దూరంగా ఉంటుంది. విద్యావంతులు ఎక్కువగా ఉన్న చిత్తూరులో వీలైనంత వరకు గొడవల జోలికి ఎవ్వరూ వెళ్లరు. కానీ ఎప్పుడూలేని విధంగా ఈసారి సార్వత్రిక ఎన్నిక ఫలితాలొచ్చినప్పటి నుంచి చిత్తూరులో గొడవలు పెరిగిపోయాయి. 'నువ్వు ఎన్నికల్లో ఆ పార్టీ నేత కోసం పనిచేసి, మమ్మల్ని కవ్వించావు. అందుకే ఈ దాడులు' అన్నట్లు గెలిచిన నేతకు చెందిన అనుచరులు గొడవలు చేస్తున్నారు. దీనివల్ల తాత్కాలిక ఆనందం పొందినప్పటికీ.. ఊరిని అభివృద్ధి చేయడంపై దృష్టి పెడదామనుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యేలకు కచ్చితంగా చెడ్డ పేరు తెస్తుంది. పైగా భవిష్యత్తులో మరో పార్టీ నాయకుడు గెలిస్తే ప్రతీకార దాడులకు దారితీసే విష సంస్కృతికి దారి చూపినట్లు అవుతుంది.

ఇది తప్పేకదా!

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు ఈనెల 4వ తేదీన వెలువడ్డాయి. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, చిత్తూరులో ఆ పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపొందిన విషయం తెలిసిందే. ఫలితాలొచ్చిన రోజే చిత్తూరులో విధ్వంస ఘటనలు మొదలయ్యాయి. ఆఫీసర్స్ లేన్ వీధిలో ఉన్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్ భవనంపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. తాళాలు వేసిన భవనంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారు. చివర్లో భవనంలోకి పెట్రోలుపోసి నిప్పంటించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో జరిగిన ఈ ఘటనతో భవనం రెండో అంతస్తులో అద్దెకుంటున్న కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటకు పరుగులు పెట్టాయి. జరగరానిది ఏదైనా జరిగి ఉంటే బాధ్యత ఎవరు వహించి ఉంటారు..?. ఇక దాని తరువాత రెండు చికెన్ సెంటర్లు, ఓ హోటల్‌పై దాడి చేశారు. మరో బేకరీని నేలమట్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడి వద్ద పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌ను ఫోన్‌లో అంతు చూస్తామని బెదిరించారు. ఓ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి ఇంటి వద్దకు వెళ్లి వేట కత్తులు చూపిస్తూ రోడ్డుపై వెళుతున్న వాళ్లను భయభ్రాంతులకు గురిచేశారు. తాజాగా గంగనపల్లెలో ఓ ఇంటిపై రాళ్లదాడికి దిగారు. చుడా మాజీ చైర్మన్ కారును ధ్వంసం చేశారు. ఎస్ఆర్.పురానికి చెందిన ఓ యువకుడ్ని కిడ్నాప్‌చేసి గొడ్డును బాదినట్లు బాదారు.

ఖాకీలపై అపవాదు

రెండు ఘటనలు మినహా.. మిగిలిన వాటిల్లో పోలీసులు కేసులు నమోదు చేయలేదు. ఇదేమిటంటే ఫిర్యాదు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని చెబుతున్నారు. ఫిర్యాదు రాలేదని సమాజంలో హత్యలు, గొడవలు, విధ్వంసాలు చేయడం సరైన చర్యలేనా..? అనేది పోలీసు ఉన్నతాధికారులు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. అసలు గొడవలు జరిగే అవకాశం ఉందని ముందుగా గ్రహించడానికి పనిచేసే నిఘా సంస్థల్లోని పోలీసులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలమయ్యారనే అపవాదు మిగిలిపోయింది. రెండు, మూడు ఘటనల్లో నిందితులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి నేర చరిత్ర లేని యువకులు ఈ ఘటనలతో పోలీసుల రికార్డుల్లోకి ఎక్కినట్లయ్యింది.



చిత్తూరులో అగ్నికి ఆహుతి అవుతున్న గ్రానైట్ ప్రైవేట్ ఆఫీసు (ఫైల్)

పరిష్కారం ఏమిటి?

దాడుల సంస్కృతి ఇలాగే కొనసాగితే ముమ్ముందు చిత్తూరులో భయానక పరిస్థితులు తలెత్తే అవకాశం లేకపోలేదు. గెలిచిన నాయకులు తమకు ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేద్దామని ఆలోచన చేస్తున్న సమయంలో.. జరుగుతున్న హింసాత్మక ఘటనలు పార్టీలతో పాటు నాయకులకు చెడ్డ పేరు తెచ్చి పెడుతుందని గ్రహించలేకపోతున్నారు. గొడవలు చేస్తున్న వ్యక్తులు వాళ్ల నాయకుడి ప్రమేయం లేకుండానే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నట్లు కొన్ని ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. తీరా గొడవలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అవుతూ అప్పటికే జరగాల్సిన నష్టాన్ని తెచ్చిపెడుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే అధికారం చేతుల్లో ఉంటే ఊరిని అభివృద్ధి వైపు కాకుండా.. రౌడీయిజం చేస్తూ పెత్తనం చెలాయించొచ్చనే చెడు భావన యువతను పెడదారివైపు నడిపించే అవకాశం ఉంది. ఇది ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ప్రజలు ఎన్నుకున్న నాయకులు వాళ్ల కార్యకర్తలు, అనుచరులతో సమావేశం నిర్వహించి హింసాత్మక ఘటనలకు పాల్పడొద్దని హెచ్చరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎవరైనా అలాంటివి చేస్తే పోలీసులు తీసుకునే చర్యలకు తాము అడ్డుపడమని కచ్చితంగా చెప్పాలి. వీలైతే తనకోసం పనిచేసే కార్యకర్తకు ఆర్థికంగా నిలదొక్కుకునే దారులు చూపిస్తే.. సమాజం కూడా హర్షిస్తుందనే విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమరావతిలో పైరవీల జోరు

- టీటీడీ చైర్మన్, బోర్డు మెంబర్ల కోసం పోటాపోటీ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రేసులో పలువురు నేతలు
- శ్రీకాళహస్తి, కాణిపాకం ట్రస్ట్‌బోర్డు కోసం స్థానికుల పట్టు
- తిరుపతి తుడా కోసం ప్రయత్నాలు ముమ్మరం
- ఆ రెండు ఎమ్మెల్సీల కోసం తిరుపతి, శ్రీకాళహస్తి నేతల పోటీ



సాక్షి, తిరుపతి: అమరావతి కేంద్రంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీటీడీ, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయ పాలకమండలి, తిరుపతి తుడా అధ్యక్ష పదవులతో పాటు ఎమ్మెల్సీ కోసం టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు జోరుగా పైరవీలు నెరుపుతున్నారు. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలో అతిముఖ్యమైన తిరుపతి తుడా చైర్మన్ పదవి కోసం ఆ మూడు పార్టీల నేతలు ఎవరికి వారు ఢిల్లీ నుంచి తెలంగాణ, ఏపీలోని ముఖ్యనేతలను కలిసి తనకు ఇప్పించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ పదవులపై అమరావతిలో పెద్ద చర్చే నడుస్తోంది. టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యుల కోసం ఉమ్మడి జిల్లాతో పాటు స్థానికేతరులు అనేక మంది పోటీపడుతున్నారు. ప్రధాని నుంచి కేంద్ర మంత్రులు, ఏపీ, తెలంగాణలోని మంత్రుల నుంచి ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు నుంచి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ల జాబితాలో ఆయనకు మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చంద్రబాబు మొండిచేయి చూపించారు. ఈ పరిస్థితుల్లో టీటీడీ చైర్మన్, బోర్డు మెంబర్ల విషయంలో జిల్లా వాసులకు ప్రాధాన్యత కల్పిస్తారనే జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ ప్రచారంలో అమరనాథ్‌రెడ్డి పేరు ముందు వరుసలో ఉంది. ఇంకా తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ పేరు కూడా తెరపైకి వస్తోంది. అదేవిధంగా బీజేపీ కోటాలో ఈ సారి టీటీడీ చైర్మన్ పదవి తమవారికే ఇప్పించుకునేందుకు ముఖ్యనేతలు పట్టుబడుతున్నారు. కమలనాథుల జాబితాలో శ్రీకాళహస్తి మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోలా ఆనంద్, తిరుపతి నుంచి భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు. వీరిద్దరిలో కోలా ఆనంద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇతనికి ఢిల్లీ, తెలంగాణ, ఏపీకి చెందిన బీజేపీ అగ్రనేతల ఆశీర్వాదం మెండుగా ఉంది. బోర్డు మెంబర్ల విషయానికి వస్తే టీడీపీకి, ముఖ్యంగా చంద్రబాబు, నందమూరి కుటుంబానికి నమ్మకస్తుడిగా ముద్రపడిన ఎన్టీఆర్ రాజు కుమారుడు శ్రీధర్‌వర్మ ముందు వరుసలో ఉన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్టీఆర్ రాజు 1984 నుంచి 1988 వరకు బోర్డు మెంబర్‌గా ఉన్నారు. 1983లో తిరుపతి ఎమ్మెల్యేగా నామినేషన్ వేసి, ఎన్టీఆర్ కోసం రాజు పోటీ నుంచి తప్పుకున్నారు. దాంతో టీటీడీ పాలకమండలిలో నాటి సీఎం ఎన్టీఆర్ రాజుకి స్థానం కల్పించారు. 2014–19 టీడీపీ హయాంలో టీడీపీ బోర్డు మెంబర్‌గా శ్రీధర్‌వర్మ పేరు దాదాపు ఖరారు అయ్యింది. అయితే సమీకరణలో భాగంగా వేరొకరికి ఇవ్వాల్సి వచ్చింది. ఆ సమయంలో చంద్రబాబు ఎన్టీఆర్ రాజుకు మాట ఇచ్చారని తెలిసింది. అందులో భాగంగా బోర్డు మెంబర్ల జాబితాలో శ్రీధర్‌వర్మ పేరు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవి కోసం అనేక మంది స్థానిక టీడీపీ నాయకులు, మరో వైపు బీజేపీ నాయకులు, జనసేన శ్రేణులు పట్టుబడుతున్నారు. ఆ జాబితాలో ఎస్సీవీ దిలీప్, చంచయ్యనాయుడు, రేణిగుంట టీడీపీ మండల అధ్యక్షులు సుబ్రమణ్యం రెడ్డి, కోట వినూత పేర్లు వినిపిస్తున్నాయి. అదే విధంగా కాణిపాకం పాలకమండలి అధ్యక్ష పదవి కోసం అనేక మంది స్థానికులు పోటీపడుతున్నారు.

ఎమ్మెల్సీ, తుడా కోసం పోటీ

తిరుపతి తుడా చైర్మన్ కోసం అనేక మంది పోటీలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సుగుణమ్మ, భానుప్రకాష్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పోటీపడుతున్నారు. తిరుపతి నాయకులే కాకుండా.. తుడా పరిధిలో ఉన్న వారు సైతం ఈ సారి చైర్మన్ పదవి తమకే ఇవ్వాలంటూ పట్టుబడుతున్నట్లు తెలిసింది. తుడా చైర్మన్ కోసం ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా ప్రయత్నాలు ప్రారంభించినట్లు విశ్వసనీయ సమాచారం. తుడా చైర్మన్ పదవి వస్తే.. అదనంగా టీటీడీ బోర్డు ఎక్స్‌అఫిషియో మెంబర్ అవ్వొచ్చనే ఆలోచనతో ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇకపోతే రాష్ట్రంలో ఉన్న రెండు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ పదవి కోసం మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సుగుణమ్మతో పాటు కోలాఆనంద్ పేరు కూడా వినిపిస్తోంది. ఎస్సీవీ నాయుడు టీడీపీ తరుపున నుంచి పోటీపడుతుంటే.. సుగుణమ్మ జనసేన, కోలా ఆనంద్ బీజేపీ కోటాలో ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరి ముగ్గురూ ఆయా పార్టీల నుంచి ఎమ్మెల్యే టికెట్ల ఆశించి భంగపడ్డారు. వీరి త్యాగాన్ని గుర్తించి ఎమ్మెల్సీ లేదా టీటీడీ, తుడాలో ఏదో ఒకటి ఇవ్వకపోతారా? అని వారి వర్గీయులు ధీమాగా ఉన్నారు. అమరావతిలో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పదవుల కోసం జిల్లాకు చెందిన నాయకులు ఎవరికి వారు పైరవీలు ప్రారంభించారు.


గరుడుడిపై గురువితడు..




వాహన సేవలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలం తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి గరుడసేవ అశేష భక్తుల గోవింద నామస్మరణల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామివారు గరుడ వాహనంపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అడుగడుగునా భక్తులు కర్పూ హారతులు సమర్పించారు. గరుడ వాహన సేవలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని దూరం చేసేదే యోగా



యోగాసనాల్లో స్పేస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు



షార్ కేంద్రంలోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో యోగాసనాలు వేస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

- షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట: మానసిక ఒత్తిడిని జయించాలంటే యోగా ఒక్కటే చక్కని మార్గమని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీహరికోటలోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో షార్ ఉద్యోగులు, అధికారులు శుక్రవారం యోగాభ్యాసం చేశారు. ఆసనాలు వేసి భారతీయ సంస్కృతిలో పుట్టిన యోగాను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా భారతీయ సంతతికి చెందింది కాబట్టి అందరూ ప్రతినిత్యం ఓ గంట సమయాన్ని కేటాయించుకుని యోగా చేస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. యోగాసనాలతో పాటు ధ్యానం, ఆహార నియమాల విషయంలో కూడా పద్ధతిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అన్ని విభాగాల డిప్యూటీ డైరెక్టర్లు, షార్ ఉద్యోగులు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధ్యక్షుడికి వీడ్కోలు



పార్థసారథిని సన్మానిస్తున్న న్యాయవాద సంఘు కార్యవర్గ సభ్యులు

తిరుపతి లీగల్: తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు ఏ.పార్థసారథి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి ఎంఆర్ పల్లి సమీపంలోని వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన సభను ఏర్పాటు చేశారు. పార్థసారథి సేవలను సిబ్బంది కొనియాడారు. ఆయనకు జ్ఞాపిక అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. కమిషన్ సభ్యులు శశిధర్‌రెడ్డి, స్నేహలత, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్, ఇతర కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు గురుప్రసాద్, గొట్టి సుబ్రమణ్యం, ప్రేమ్‌కుమార్, సుదర్శన్‌బాబు, జాన్ పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేరిన మొదటి రోజే!

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- వాకాడు మండలంలో విషాదం



వంశీ (ఫైల్)

తడ: పరిశ్రమలో ఉద్యోగంలో చేరిన మొదటి రోజే ఓ యువకుడు బస్సు కింద పడి మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. వాకాడు మండలం, నెల్లిపూడి గ్రామానికి చెందిన బైన వంశీ(28) మాంబట్టు అపాచీ కంపెనీలో గురువారం ఉద్యోగంలో చేరాడు. శుక్రవారం తొలి రోజు విధులకు హాజరయ్యేందుకు గ్రామం నుంచి స్కూటీపై బయలుదేరాడు. ఈ క్రమంలో కాదలూరు గ్రామ పరిధిలోని పాములకాలువ సమీపంలో సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోకి చెందిన బసును దాటేక్రమంలో అదుపు తప్పి బస్సుకింద పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న తడ ఎస్ఐ పీ.నరసింహారావు సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?

- రోడ్డున పడుతున్నా... కూటమి స్పందించదా?
- నీట్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే నీట్, నెట్ పేపర్లు లీక్
- మోదీ పాలన అవినీతి, కుంభకోణాల మయం
- రాష్ట్రంలో 66 వేల మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం
- కేంద్రాన్ని నిలదీస్తున్న విద్యార్థి సంఘాల నేతలు



ఎస్వీయూలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘ నాయకులు

తిరుపతి సిటీ: 'కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతోంది. నీట్ లేకేజీ వ్యవహారంపై తక్షణం సమగ్ర విచారణ జరిపించాలి. లేకుంటే ఆందోళనలు మిన్నంటిస్తాం' అంటూ విద్యార్థి సంఘాల నాయకులు తేల్చిచెప్పారు. గత రెండు రోజులుగా ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూ, ఏఐఎస్ఈసీ, ఏఐడీఎస్ఓ తదితర విద్యార్థి సంఘాలు నగరంలోని ప్రధాన కూడళ్లు, వర్సిటీల ఎదుట నిరసనలు, ధర్నాలతో కదం తొక్కుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎస్వీయూలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం నాయకులు మల్లికార్జున, షేక్ జావెద్ మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో 24 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగితే ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన అనేక మంది విద్యార్థులకు 720కి 720 రావడమేమిటని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 66 వేల మంది విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లితే కనీసం రాష్ట్రంలో కూటమి నేతలు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఇటువంటి కుంభకోణాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. మోదీ పాలన అవినీతి కుంభకోణాల మయమన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మూల్యం చెల్లించక తప్పదు



విద్యార్థుల ఆగ్రహానికి గురికాకముందే కేంద్రం నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే భారీ మూల్యం తప్పదు. పేపర్‌ను లీకేజీ చేసి రూ.32లక్షలకు అమ్ముకుని 24లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేసిన కేంద్ర మంత్రి తక్షణం రాజీనామా చేయాలి.ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలి. ప్రతి పోటీ పరీక్షల పేపర్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే లీకేజీ అవుతోంది. నీట్ వ్యవహారంలో సమగ్ర విచారణ జరిపి నిందుతులను కఠినంగా శిక్షించాలి.

-జే.మల్లికార్జున,
ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నీట్ పరీక్షను రద్దు చేయాలి



నీట్ పరీక్షను తక్షణం రద్దు చేసి తిరిగి పారదర్శకంగా నిర్వహించాలి. విద్యార్థులకు ఏడాది నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి. ఇంత పెద్ద అవినీతి, కుంభకోణాలు జరుగుతున్నా ఇతర పార్టీలు మిన్నుకుండడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. రాష్ట్రం ప్రభుత్వం నీట్ లేకేజీపై స్పందించాలి. ఎన్‌టీఏ సంస్థ మోదీ కనుసన్నలలో పనిచేస్తోంది. అందుకే నీట్, నెట్ పరీక్షా పేపర్లు లీకేజీ అవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదు.

-రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

పార్లమెంట్‌ను ముట్టడిస్తాం



నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం జరగకుంటే దేశా వ్యాప్తంగా విద్యార్థి సంఘాలతో కలసి ఢిల్లీలోని పార్లమెంట్‌ను ముట్టడిస్తాం. మోదీ విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. కేంద్ర మంత్రి ధర్మేంద ప్రధాన్‌ను తక్షణం కేబినెట్ నుంచి తొలగించాలి. నీట్ లీకేజీలో ప్రధాన పాత్ర వహించిన ఎన్‌టీఏ అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల ఆగ్రహానికి గురికాకముందే కేంద్రం నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలి

-నవీన్‌కుమార్, ఏఐఎస్ఎఫ్,
జిల్లా అధ్యక్షులు, తిరుపతి

కూటమి నేతలు మౌనం వీడరా?



రాష్ట్రంలో సుమారు 66వేల మంది విద్యార్థులు రోడ్డున పడ్డారు. ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వమే పేపర్ లీకేజీ అయిందని ఒప్పుకుంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి నేతలు కనీసం స్పందించక పోవడం విడ్డూరంగా ఉంది. కూటమి నేతల పిల్లలు సైతం నీట్ పరీక్షలు రాసిన వారిలో ఉన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడాల్సిన అవసరం, సమయం ఆసన్నమైంది. పెదవి విప్పండి. నీట్ పరీక్షను తిరిగి నిర్వహించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి.

-ఎం.ప్రేమ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ
ఎస్వీయూ విద్యార్థి విభాగం అధ్యక్షుడు

మోదీ పాలన అవినీతిమయం



కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. నీట్ నిర్వహణలో అవినీతి అక్రమాలు జరగలేదని బుకాయించింది. తాజాగా కేంద్ర మంత్రి అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని ఒప్పుకోవడం సిగ్గుచేటు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారినా కేంద్ర ఇప్పటికీ నీట్ పరీక్షపై నిర్ణయం తీసుకోకపోవడం దారుణం. తక్షణం కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి.

-హరీష్, ఏఐఎస్ఈసీ
రాష్ట్ర సెక్రటేరియట్ మెంబర్

శ్రేష్టలో మెరిసిన నేత్విక

– జాతీయ స్థాయిలో 353వ ర్యాంక్



పెళ్లకూరు: కేంద్ర సర్కారు అట్టడుగు స్థాయిలో ఉన్న పేద విద్యార్థులను శ్రేష్ఠతో ప్రోత్సహిస్తోంది. దళిత విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ఇంటర్నేషనల్ రెసిడెన్షియ ల్ స్కూల్లో చదువుకొనే అవకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగానే శుక్ర వారం వెలువడిన శ్రేష్ఠ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో (స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్ ఇన్ హైస్కూల్) తాళ్వాయిపాడు జెడ్పీ హైస్కూ ల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని వంకపూరి నేత్విక జాతీయ స్థాయిలో 353వ ర్యాంక్ సాధించింది. ఇటీవల ప్రకటించిన ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌టెస్ట్)లో కూడా విద్యార్థిని అర్హత పొందింది. అలాగే నేత్విక సోదరుడు గ్రేష్వంత్ 2022లో శ్రేష్ఠ ఎంట్రన్స్‌లో 541ర్యాంక్ సాధించి తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో ఉన్న శ్రీమహర్షి ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్లో సీటు పొంది చదువుకుంటున్నాడు. అన్నా, చెల్లెలు ఇద్దరూ అటు ఎన్ఎంఎంఎస్‌లోనూ, ఇటు శ్రేష్ఠ లోనూ ప్రతిభ కనపరచడం విశేషం.

యూజీ, పీజీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: ఎస్వీ వేదిక్ వర్సిటీలో యూజీ(శాస్త్ర), పీజీ(ఆచార్య) కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 వరకు చివరి గడువుగా ప్రకటించినా, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈనెలాఖరు వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 21 విభాగాల్లో యూజీ, పీజీ కోర్సులతో పాటు టెంపుల్ మేనేజ్‌మెంట్, జోతిష్యం, వాస్తు, మ్యాన్‌స్క్రిప్ట్ సబ్జెక్టుల్లో డిప్లొమో కోర్సులకు, మరో ఏడు విభాగాల్లో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు వేదిక్ వర్సిటీ అధికార వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేడు, రేపు న్యాయమూర్తులకు వర్క్‌షాప్

తిరుపతి లీగల్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయమూర్తులకు శని, ఆదివారాలు చిత్తూరులోని జెడ్పీ మీటింగ్ హాల్లో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా కోర్టు నుంచి తిరుపతి కోర్టులకు ఉత్తర్వులు అందాయి. వివిధ అంశాలపై రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. న్యాయమూర్తులు వర్క్‌షాపునకు వెళ్లనుండడంతో ఆయా కోర్టుల పరిధిలోని ప్రాంతాల్లో అత్యవసర ఎఫ్ఐఆర్‌లు, రిమాండ్లు, మరణ వాంగ్మూలాలను ఎగ్జిక్యూటీవ్ మెజిస్ట్రేట్(తహసీల్దార్లు)లు చూసుకోవాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. భక్తుల క్యూ బాటగంగమ్మ ఆలయం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 62,756 మంది స్వామివారిని దర్శించుకోగా, 31,510 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది.

ఐఐటీలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం



విద్యార్థులతో డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: మండల కేంద్రం సమీపంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయాన్ని డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. తరగతి గదులు, స్పోర్ట్స్, మ్యూజికల్ గదులను ప్రారంభించారు. ముందుగా విద్యార్థులతో ప్రార్థన, ప్రతిజ్ఞ, జెండా ఆవిష్కరణ చేయించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఐఐటీ తిరుపతి ఆధ్వర్యంలో గ్రేడ్ వన్ నుంచి గ్రేడ్ 5 వరకు తరగతులను ప్రాజెక్ట్ మోడ్‌లో ప్రారంభించినట్లు వివరించారు. ప్రతి విభాగంలో 32 మంది విద్యార్థులు ఉంటారని తెలిపారు. ఐఐటీ తిరుపతి రిజిస్ట్రార్ సుమిత్ బిస్వాస్, డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్ మెహతా, ఐసర్ అసోసియేట్ ప్రొఫెసర్ కనగశేఖరన్, విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్‌కు మహో'యోగ'ం!



మహిళా వర్సిటీలో యోగాసనాలు వేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, విద్యార్థులు



తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో యోగాసనాలు

తిరుపతి సిటీ: యోగాను ప్రపంచదేశాలకు పరిచయం చేసిన ఘనత భారత దేశానిదేనని మహిళా వర్సిటీ వీసీ డీ భారతి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలసి అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగా తప్పనిసరిగా దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. యోగా ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ అనేది 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్‌గా తెలియజేశారు. ఈ కార్యక్రమంలతో రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ విద్యావతి పాల్గొన్నారు.

ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో..

ఎస్వీ అగ్రికల్చర్ కళాశాలో యోగా గురువు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది యోగాసనాలు వేశారు.

ఎస్వీడబ్ల్యూ కళాశాలలో....

యోగా దినోత్సవాన్ని ఎస్వీడబ్ల్యూ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ టీ నారాయణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు యోగాసనాలతో అలరించారు. ముఖ్యఅతిథిగా ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.వాణి హాజరై యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు.

యోగాతో వ్యాధుల నియంత్రణ

తిరుపతి సిటీ: నిత్యం యోగా సాధనతో అనేక వ్యాధులను నియంత్రించవచ్చని, రుగ్మతులను రూపుమాపడంలో యోగా ఆయుధం వంటిదని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతీయ సంస్కృత వర్సిటీలో జరిగిన అంతర్జాతీయ యోగా సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, శారీరక దృఢత్వానికి యోగా దివ్యౌషధంగా పనిచేస్తుందన్నారు. వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ యోగా శాస్త్రం మనకు లభించిన గొప్ప సంపదన్నారు. యోగా ప్రయోజాలను వివరించారు. మహిళా వర్సిటీ వీసీ డి.భారతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగా అలవర్చుకోవాలన్నారు. యోగా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు యోగాసనాలు వేశారు. వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, స్విమ్స్ మెడిసన్ హెచ్‌ఓడీ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ రమాశ్రీ, డాక్టర్ జ్యోతి, డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎస్వీ వేదిక్ వర్సిటీలో..

ఎస్వీ వేదిక్ వర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ భగవంతుని ఆరాధనతో సమానంగా యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. మానిసిక ప్రశాంతతకు, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఆధునిక సమాజంలోని ప్రతి వ్యక్తికి అవసరమని తెలిపారు. అనంతరం వీసీ రచించిన ఆకాశం నవ్వుతోంది కవితా సంపుటిని అతిథులు ఆవిష్కరించారు. వేదిక్ విద్యార్థులు వేసిన యోగాసనాలను ముఖ్యఅతిథులు పరిశీలించి అనుసరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడిసన్ విభాగం హెచ్‌ఓడీ అల్లాడి మోహన్, ప్రముఖ కవయిత్రి అత్తలూరి విజయలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాధాగోవింద త్రిపాఠి, డీన్ రాధేశ్యామ్, డాక్టర్ పి.నీలకంఠం, రామ్‌నారాయణ, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతావని అందించిన అమూల్య బహుమతి

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ప్రాచీన భారతావని మానవాళికి అందించిన అమ్యూల్య బహుమతి యోగా అని పేర్కొన్నారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. దైనందిక జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకుని తద్వారా మంచి ఆరోగ్యం, చక్కని మానవ సంబంధాలు, మంచి ఆలోచనలను పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులు, సెజ్ కార్యాలయ సిబ్బంది, స్థానిక పోలీసులు, చిన్మయ, అకార్డ్ స్కూల్ విద్యార్థులు, పరిసర గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఘనంగా యోగా దినోత్సవం

సత్యవేడు: శ్రీసిటీలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీసిటీ జనరల్ మేనేజర్ సన్యాసిరావు ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్థానిక విజిటర్ సెంటర్ ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. 200 మంది పాల్గొన్నారు. జీఎం మాట్లాడుతూ సమాజం కోసం యోగా థీమ్‌గా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యోగా గురువు, ఏపీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.కోదండం ప్రత్యేక అతిథి పాల్గొని సూర్యనమస్కారాలు, వివిధ శ్వాస ప్రక్రియల్లో శిక్షణ ఇస్తూ ప్రయోజనాలను వివరించారు.

పోలీసులకు యోగా ఎంతో అవసరం

తిరుపతి క్రైమ్: నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే పోలీసులకు మానసిక, శారీరక దృఢత్వం సాధించడానికి యోగా అవసరమని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్ పరేడ్ గ్రౌండ్లో యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగా కార్యక్రమానికి పోలీసు సిబ్బంది హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు.



తిరుపతి డీఎస్పీ రవిమనోహరాచారికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

పోలీసులతో ఆత్మీయ సమావేశం

ఓట్ల లెక్కింపు ప్రక్రియ తిరుపతిలో ప్రశాంతంగా ముగియడంతో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుమల, తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా పోలీసు అధికారులు నిర్వహించారని కొనియాడారు. ఈ మేరకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఎస్పీ ఏఎస్పీలతో కలిసి సిబ్బందికి భోజనాలు స్వయంగా వడ్డించారు. సమావేశంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



సంస్కృత వర్సిటీలో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్



వేదిక్ వర్సిటీలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు



శ్రీసిటీలో యోగాసనాల్లో విద్యార్థులు, ఉద్యోగులు